'సండే ఈవెనింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు రాత్రి 8 గంటలకు నిర్వహిస్తారు.'లెస్ ఎఫర్ట్ అండ్ మోర్ రిజల్ట్ మేకింగ్–2025 ది ఇయర్ ఆఫ్ ట్రాన్స్ఫర్మేషన్' అనే అంశంపై న్యూజిలాండ్‌లో స్పిరిచువల్ టీచర్, ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ట్రైనర్ జిలియన్‌సావర్స్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

మ్యాన్‌హోళ్ల మరమ్మతులకు శ్రీకారం

రాయదుర్గం: మ్యాన్‌హోళ్ల మరమ్మతులకు జలమండలి అధికారులు శ్రీకారం చుట్టారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని పలు చోట్ల మ్యాన్‌హోళ్ల మరమ్మతు పనులను రాయదుర్గంలో ప్రారంభించారు. జలమండలి గచ్చిబౌలి మేనేజర్ బి. నరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ పనులను ప్రారంభించారు. జలమండలి గచ్చిబౌలి సెక్షన్ పరిధిలోని అన్ని కాలనీలు,బస్తీలలో మ్యాన్‌హోళ్లను మరమ్మతు చేస్తామని తెలిపారు.

రేపు నిధి ఆప్కే నికత్ 2.0

పటాన్‌చెరు టౌన్: ఈ నెల 27న నిధి ఆప్కే నికత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు కేంద్రాల్లో శిబిరాలను ఉ.9: 30 నుంచి సా.5:45 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. రామచంద్రపురం బీహెచ్‌ఈఎల్ మెయిన్ ఎంట్రెన్స్ గేట్ వద్ద, మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీ, సంగారెడ్డి జిల్లా కోర్టు వెనకాల జలబాగ్ వద్ద శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భవిష్యనిధి సమస్యలు ఉన్నవారు పరిష్కరించుకోవాలని సూచించారు.

నేడు ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం జంగంపేట గ్రామ శివారులోని రేణుక ఎల్లమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం గురువారం ప్రారంభం కానున్నాయి. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో మొదటి రోజు ఉ.7 గంటలకు గణపతి పూజ పుణ్యావచనం, అమ్మవారికి పంచామృత సహస్ర ఘటాభిషేకం, అలంకరణ అర్చన చండీ హోమం, రుద్రహోమం, పూర్ణాహుతి హారతి పూజలను నిర్వహించనున్నారు. రెండో రోజు అమ్మవారికి లలిత సహస్రనామ స్తోత్ర పారాయణం, బోనాల సమర్పణ పూజలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు నాగదేవతల, నందీశ్వరుని ప్రతిష్ఠ

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్ సమీపంలోని శాస్త్రి నగర్‌లో శివ ఆంజనేయ స్వామి నాగదేవతల, నందీశ్వర పునః ప్రతిష్ఠ, నూతన దీపస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి పూజ, మండపారాధన తదితర పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం 10.27 గంటలకు చింతపల్లి వంశీ మోహన్ రెడ్డి, డీఎస్పీ చింతపల్లి శోభ, గూడూరి కల్యాణ్ రెడ్డిలచే నాగదేవతల, నందీశ్వర పునః ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో మ్యాథ్స్ డే

ఫిలింనగర్: ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజం జయంతిని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం మ్యాథ్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణిత శాస్త్రానికి సంబంధించిన స్కిట్స్, క్విజ్, ఫజిల్స్ వంటివి ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ గణిత శాస్త్ర జ్ఞానాన్ని పెంపొందించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

అయ్యప్ప స్వామి పడిపూజ

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో సుబ్బన్న గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ బుధవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి బీఆర్ఎస్ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగుల సత్యం హాజరయ్యారు. అనంతరం అయ్యప్ప దీక్ష స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కన్నె స్వాములు దినేష్ నాయుడు, ధర్మేష్ నాయుడు, రవి, నాయకులు పి. శ్రీనివాస్ గౌడ్, ఎం. జనార్దన్, సాంబ కృష్ణ, దొండపాటి రాజు, రమణ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు భక్తాంజనేయ స్వామి ఆలయంలో కుంభాభిషేకం

నిజాంపేట్: బాచుపల్లిలోని శ్రీ భక్తాంజనేయ స్వామి, శ్రీ సప్తమాతృక రాధమ్మదేవి ఆలయాల్లో ఈ నెల 26న పుష్కర కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో నవగ్రహాది దేవతాలకు కుంబాభిషేకం, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నారు.


మియాపూర్‌లోని బీకే ఎన్‌క్లేవ్‌లోని రాక్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, ప్లాసర్, నాయకులు


రాయదుర్గంలో..


ఆదర్శనగర్‌లోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో..

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు


రాయదుర్గంలోని హోరేబు మినిస్ట్రీస్ చర్చిలో..



లింగంపల్లి దోయన్స్‌కాలనీలోని గంగా ఫిల్లింగ్ స్టేషన్‌లో క్రిస్మస్ వేడుకల్లో ..

శేరిలింగంపల్లి/రాయదుర్గం: క్రైస్తవ సోదరుల పర్వదినమైన క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.బుధవారం శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని పలు కాలనీలు,బస్తీలలో చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు, క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఏసుక్రీస్తును కొలుస్తూ ఆలపించిన గీతాలు, పాస్టర్ల ప్రత్యేక పర్వదిన సందేశాన్ని వినపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు చర్చీలలో జరిగే కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు.

ప్రత్యేక ఆకర్షణగా శాంతాక్లాజ్ వేషధారులు

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని శాంతాక్లాజ్ వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శేరిలింగంపల్లిలోని డోయన్స్ కాలనీలోని గంగా ఫిల్లింగ్ స్టేషన్‌లో యజమానులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే శాంతా క్లాజ్ వేషధారణతో ఇంధనం కోసం వచ్చే వారికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలపడం, చిన్నారులకు చాక్లెట్లు, బహుమతులు అందించారు. దీంతో శాంతాక్లాజ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

చర్చీలలో ప్రత్యేక కార్యక్రమాలు..

- మియాపూర్‌లోని బీకే ఎన్‌క్లేవ్‌కాలనీలోని రాక్‌చర్చ్‌లో క్రిస్మస్ వేడుకల్లో పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పాల్గొని కేక్ కట్ చేశారు. పలు కార్యక్రమాలను ఈ సందర్భంగా నిర్వాహకులు నిర్వహించారు. పాస్టర్ స్వామి పర్వదిన సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, గంగాదర్, ప్రసాద్, అమరేందర్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- రాయదుర్గంలోని హోరేబు మినిస్ట్రీస్ చర్చీలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్‌ను శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయి బాబా కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు సందీప్, సుహాసిని, సంతోష్, సుధీర్, దారుగుపల్లి నరేష్, శామ్లేట్ శ్రీనివాస్, పలువురు స్థానికులు పాల్గొన్నారు.
- శేరిలింగంపల్లిలోని నల్లగండ్లలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్ గౌడ్ క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సౌందర్యరాజన్, రఘునందన్ రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సన్నీబెనర్జీ,సాయి కిషోర్, దుర్గేష్,మూర్తి పార్వతి తదితరులు పాల్గొన్నారు.
- ఆదర్శనగర్‌లోని సీఎస్ఐ వెస్లీ చర్చీలో ప్రత్యేక ప్రార్థనలలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం క్రైస్తవులకు పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, పాస్టర్లు, నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.



నృత్యం.. నయనానందకరం

మాదాపూర్: కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ చేనేత హస్తకళా మేళాలో భాగంగా బుధవారం శ్రీకాకుళానికి చెందిన కూచిపూడి గురువు రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్యబృందంచే మహాగణపతిం, శివోహం, శ్రీనివాస కల్యాణం, పరమపురుషుడు, ఓంకార రూపిణి, కదిరి నరసింహుడు, నందకధార తదితర అంశాలను రామకొండిన్య, నేహ, వర్షిత, చాందిని, లలిత, శ్రేయశ్రీ, ప్రవల్లిక, సాహిత్య, శాశ్విత, కాలజ్ఞ, మోక్షిత తదితరులు పాల్గొని కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించి అలరించారు. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ తంజాపూర్ సంయుక్త నిర్వహణలో రూప్ చంద్ బృందం పురూలియా చౌ జానపద నృత్యం ఆకట్టుకుంది. సస్మితా మిశ్ర శిష్యబృందంచే ఒడిసి నృత్యప్రదర్శనలో హంసధ్వని పల్లవి, శంకరాభరణం పల్లవి, బసంత్ పల్లవి, స్థాయి, మోక్ష తదితర అంశాలను శుభశ్రీ, అంకిత, శ్రద్ధ, జ్యోతిక, రిధి, అన్విత తదితరులు పాల్గొని సందర్శకులను ఆలరించారు.




మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

శేరిలింగంపల్లి: అయ్యప్పస్వామి నామస్మరణతో తారానగర్, లింగంపల్లి ప్రాంతాలు మార్మోగాయి. అయ్యప్పస్వామిని కొలుస్తూ ఆలపించిన భక్తి గీతాలు భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. బుధవారం రాత్రి తారానగర్‌లోని శివాలయం నుంచి అయ్యప్ప స్వామి ఊరేగింపు నిర్వహించారు. ఆలింద్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది. మార్గమధ్యంలో ఊరేగింపులో అయ్యప్పస్వామిని కొలుస్తూ పాటలు పాడుతూ భక్తులు పాల్గొన్నారు. అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామి భజనలు, నాదస్వరం, చండమేళము, కావడి అట్టం, సింగారి మేళం, అమ్మన్ కూడం తదితర కార్యక్రమాలతో ఈ ఊరేగింపు సాగింది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

27న కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ ఎం.ఎన్.రెడ్డి.నగర్‌లోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సందిరి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా 27న గణపతి పూజ, పుణ్యహ వాచనము, ఋత్విగ్వరణము, కలశస్థాపన, అవాహిత దేవతారాధన, 28న ఉదయం గణపతి, నవగ్రహ, సుబ్రహ్మణ్య, మన్యుసరాక్త, మృత్యుంజయ సహిత రుద్రహోమం, చండీ హోమం, పూర్ణాహుతి, శివ కల్యాణం, ఋత్విక్ సన్మానం, మధ్యాహ్నం 1 గంటకు అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

11న ప్రకృతి ఒడిలో సంక్రాంతి సంబరాలు

బంజారాహిల్స్: ప్రకృతిని కాపాడాలి, ప్రకృతి విలువ, మొక్కల విలువను నగరవాసులకు తెలియజేసేందుకు ఈసారి సంక్రాంతి వేడుకలను తన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించనున్నట్లు ప్రముఖ రైతు నాగరత్నం నాయుడు తెలిపారు. జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అందుకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామోజీ ఫిలిం సిటీ సమీపంలోని దైరా గ్రామంలో జనవరి 11వ తేదీన సంబరాలు నిర్వహిస్తామన్నారు. పాల్గొనే వారికి కుండల తయారీ, ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్ వంటి వినోదాత్మక క్రీడలు కూడా ఉంటాయన్నారు. అదేవిధంగా బీడు భూమిలో తాను ఎన్నో ప్రయోగాలు చేసిన అద్భుతాలను సైతం నగరవాసులకు పరిచయం చేస్తానన్నారు. వ్యవసాయ రంగంలో తాను చేసిన ప్రయోగాలకు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల నుంచి 437 అవార్డులు లభించినట్లు తెలిపారు. హాజరయ్యే వారు 7032691531 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాంబాబు పొన్నాన తదితరులు పాల్గొన్నారు.

ఆ పరిశ్రమపై చర్యలు తీసుకోండి

జిన్నారం (పటాన్‌చెరు): ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని రాళ్లకత్వ గ్రామస్తులు ఆరోపించారు. జిన్నారం మండలం గ్రామ శివారులోని సర్వేనంబర్ 286 అసైన్డ్ భూముల్లో అక్రమంగా కొనసాగుతున్న బ్యాటరీ రీసైక్లింగ్ కెమికల్ ఫ్యాక్టరీ పనులు వెంటనే నిలిపేయాలని పరిశ్రమ వద్ద గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్ చేస్తూ పనులు కొనసాగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థాలు నేరుగా చెరువులు కుంటల్లో చేరి పంటలు దెబ్బతిని, పశువులకు తాగునీరు లేకుండా పోతోందని వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి పనులు నిలిపివేయాలని గ్రామస్తులు కోరారు.


పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఆలయ నిర్మాణానికి విరాళం


ఆలయ కమిటీ సభ్యులతో శ్రీకాంత్ గౌడ్

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మతల్లి ఆలయ నిర్మాణానికి విరాళాలు కొనసాగుతున్నాయి. బుధవారం పటాన్‌చెరు బీఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.దేవాలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో వెంకటేశం గౌడ్, భోజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బండి శ్రీకాంత్ గౌడ్, మంద రమేష్, లింగం, నర్సింగ్, నిఖిల్, అనిల్, ఎల్లయ్య ఉన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం

- పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌గౌడ్, మంత్రులు హాజరు


సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మధు

పటాన్‌చెరు టౌన్: మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడుపాయల దుర్గాభవాని ఆలయంతో పాటు క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చిలో జరిగిన శతాబ్ది వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో ఏడుపాయల చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ, మంత్రులకు హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే రోహిత్, సంజీవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, డీసీసీ ప్రెసిడెంట్ ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పూజల హరికృష్ణతో కలసి ఏడుపాయల వనదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయాభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అక్కడి నుంచి మెదక్ చర్చికి బయల్దేరి శతాబ్ది క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుక కమ్యూనిస్టులు


విరాళాలు అందజేస్తున్న కార్మికులు

పటాన్‌చెరు టౌన్: ప్రశ్నించే గొంతుక కమ్యూనిస్టులని, ఎర్రజెండా లేకపోతే ప్రజా సమస్యలు చర్చకే రావని సీపీఎం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్ అన్నారు. బుధవారం సీపీఎం రాష్ట్ర మహాసభలకు ఏషియన్ పెయింట్ కార్మికులు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ... దేశంలో ఎర్రజెండా లేకపోతే ప్రజల తరపున, పేదల తరపున ప్రశ్నించే వాళ్లే ఉండరని అన్నారు. కమ్యూనిస్టులు బలంగా ఉన్నచోట, అధికారం ఉన్నచోట ఆయా దేశాలు అభివృద్ధి చెందుతున్నాయని, ప్రజల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు. వచ్చే నెల 25 నుంచి 28 వరకు జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య, ఏషియన్ పెయింట్ కార్మిక నాయకులు మనీరాజు, బీఎస్ రెడ్డి, రాజా, ముత్యాలయ్య, గట్టయ్య, జనార్దన్, కార్మికులు పాల్గొన్నారు.

ప్రపంచం మెచ్చిన నేత వాజ్‌పేయి


వాజ్‌పేయ్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు చంద్రమోహన్ తదితరులు


రామచంద్రాపురం(పటాన్ చెరు): వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ఆదర్శనగర్‌లో మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బీహారి వాజ్‌పేయ్ జయంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు నీరటి చంద్రమోహన్ ఆధ్వర్యంలో వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రపంచం మెచ్చిన నేత వాజ్‌పేయ్ అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి, గంగరాజు, శ్యామ్, అశోక్, నవీన్ పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతిని బుధవారం పట్టణంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బలరాం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశాభివృద్ధికి వాజ్‌పేయి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, గోపాల్‌రెడ్డి, యాదగిరి, మల్లేశ్ పాల్గొన్నారు.

ఆరాంఘర్ చౌరస్తాలో ఆటోస్టాండ్ ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతి పత్రాన్నిస్తున్న నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: ఆరాంఘర్ చౌరస్తాలో ఆటో స్టాండ్ లేనందున ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జాజాల రుద్రకుమార్ అన్నారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను కోరారు. ఈ మేరకు రాజేంద్రనగర్ మండల ట్రాన్స్‌పోర్ట్స్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కాలే రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ... ఆరాంఘర్ నుంచి మెహిదీపట్నం బస్‌స్టాప్ రోడ్డులో సుమారు 50 మంది కార్మికులు ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఆరాంఘర్ చౌరస్తాలో ప్రయాణికుల రద్దీ పెరిగినందున అక్కడ ఆటోలు ఆపడం ఇబ్బందిగా మారిందన్నారు. చౌరస్తాలోని పిల్లర్ నెంబర్లు 319–320ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో కొందరు ద్విచక్ర వాహనాలను ఆపి వెళ్లిపోతున్నారన్నారు. ఆ స్థలంలో ఆటోలు పార్క్ చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అయితే ఇందుకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సానుకూలంగా స్పందించి షరతులతో కూడిన అనుమతి ఇచ్చారన్నారు. ఒకవేళ రాబోయే రోజుల్లో ఆప్రాంతంలో గ్రీనరీ లేదా రోడ్డు డెవలప్‌మెంట్ అయితే ఆటోల అడ్డాను పక్కకు జరపాల్సి ఉంటుందని సూచించారన్నారు.

హాజరైన భక్తులు



'కల్వారి'లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు


ప్రసంగిస్తున్న డాక్టర్ సతీష్ కుమార్



క్రీస్తు జననంపై వేసిన నాటకం

చందానగర్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మియాపూర్ కల్వారి టెంపుల్‌లో బుధవారం వైభవంగా వేడుకలు జరిగాయి. కల్వారి టెంపుల్ వ్యవస్థాపకులు డాక్టర్ సతీష్ కుమార్ భక్తులకు క్రీస్తు జన్మంపై వివరించి, ప్రవచనలు అందించారు. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తులు భారీ సంఖ్యలో కల్వారి టెంపుల్ వచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మూడు మందిరాలలో లక్షల మంది భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కల్వారి టెంపుల్ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. దాదాపు మూడు లక్షలాదిగా కల్వారి టెంపుల్‌కు భక్తులు తరలి వచ్చి యేసుక్రీస్తు ప్రార్థనలు చేసి ప్రవచనలు ఆలకించారు. కల్వారి టెంపుల్ చుట్టు పక్కల ఎటు చూసిన భక్తులతో కిక్కిరిసింది. క్రీస్తు నాటక ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు 100 అడుగుల క్రిస్మస్ ట్రీ వద్ద సందర్శకులు ఫోటోలు దిగారు. కల్వారి టెంపుల్ వద్ద వచ్చిన భక్తులకు పోలీస్ సిబ్బంది, కల్వారి టెంపుల్ సిబ్బంది భద్రత ఏర్పాట్లు నిర్వహించారు.